

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుదాఘాతంతో రైతులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. 8లో▸



పర్యవేక్షణ కరువు!

నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం ఠాణాలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేక ఇబ్బందులు తప్పడం లేదు. 8లో▸



అప్పుల ఊబిలో..

ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించిన మాజీ ప్రజాప్రతినిధులు అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎస్ఎస్ఏల సమస్యలు సీఎంకు వివరిస్తా

స్పీకర్ ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్ఎస్ఏల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. గురువారం వికారాబాద్‌కు వచ్చిన ఆయన ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏలతో ఆయన మాట్లాడారు. మీ సమస్యలను సీఎంకు వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కో కన్వీనర్‌గా మౌనేశ్వర్‌చారి



తాండూరు టౌన్: రాష్ట్ర యూనివర్సిటీల ఏబీవీపీ కో కన్వీనర్‌గా పెద్దేముల్‌కు చెందిన మౌనేశ్వర్ చారి నియమితులయ్యారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు సిద్దిపేటలో జరిగిన ఏబీవీపీ మహాసభల్లో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మౌనేశ్వర్ చారిని కో కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ, యూనివర్సిటీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై అలుపెరుగని పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి పండిట్

తాండూరు టౌన్: ప్రజా సమస్యలపై సీపీఐ పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తాండూరు పట్టణంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజాం, రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పార్టీ ప్రజల పక్షాన నిలబడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్‌రెడ్డి, పీర్ మహ్మద్, వెంకటయ్య, అబ్దుల్లా, నాయకులు దస్తప్ప, ఏసురత్నం, నర్సింలు, ఖాదర్, విమలమ్మ, సంతోష, జగదాంబ, రవీందర్, మునీర్ అహ్మద్, విజయ్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లను వ్యతిరేకిస్తున్నాం

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరత్నం, రాములు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరత్నం

కుల్కచర్ల: కేజీబీవీల్లో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఎచ్ వెంకటరత్నం, రాములు అన్నారు. గురువారం కుల్కచర్లలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా శ్రమ దోపిడీకి గురవుతున్నది కేజీబీవీ ఉద్యోగులేనని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉద్యోగులందరికీ మూల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మొదటి పీఆర్‌సీని సిఫారసు చేసి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జమున, కోశాధికారి మోయిజ్, జిల్లా కార్యదర్శులు రత్నం, కృష్ణవేణి, సలీం, బసప్ప, శివరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చల్లచల్లగా..

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- ఉదయం మబ్బులు.. సాయంత్రం జల్లులు
- చలికి గజగజ వణికిన జనం



వికారాబాద్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం ఉదయం నుంచి రోజంతా మోస్తరు వర్షం కురిసింది. ఉదయం మబ్బులు కమ్మేసి ఉండటం.. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో అప్పటికే వివిధ పనుల కోసం బయటికి వెళ్లిన వాహనదారులు, వీధి వ్యాపారులు, పాదచారులు తడిసి ముద్దయ్యారు. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులకు చలిగాలులు తోడవడంతో చిన్నారులు, వృద్ధులు గజగజ వణికిపోయారు. చలికారణంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఆఫ్ చేశారు. ఫలితంగా రోజు వారీ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. రంగారెడ్డి జిల్లాలో డిసెంబర్ 19న అత్యధికంగా 3,145 మెగావాట్ల (60.25 మిలియన్ యూనిట్లు) డిమాండ్ నమోదు కాగా, 25న అత్యల్పంగా 3,039 మెగావాట్లు (57.58 ఎంయూ)లు రికార్డు అయింది. తాజాగా గురువారం 2,940 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం. అర్ధరాత్రి, మధ్యాహ్నం వేళతో పోలిస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదవుతుండటం విశేషం. వేడినీళ్ల కోసం గీజర్లు, హీటర్లు వాడుతుండటమే ఇందుకు కారణమని ఇంజనీర్లు చెబుతున్నారు.

ఇళ్లకే పరిమితం

తెల్లవారుజాము నుంచి మబ్బులు కమ్ముకోవడం.. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. స్కూళ్లకు సెలవు ఉండటంతో తల్లిదండ్రులు పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపలేదు. వృద్ధులు, చిన్నారులు స్వెటర్లు ధరించి చలి నుంచి ఉపశమనం పొందారు. పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 10 గంటల వరకు రోడ్లు సరిగ్గా కనిపించలేదు. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సి వచ్చింది. చలి తీవ్రత మామిడి పంటకు కొంత మేలు చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈదురు గాలులు, వర్షం పడితే పూత రాలిపోయే ప్రమాదం ఉందని వివరించారు. పత్తి పంట చేతికొస్తున్న తరుణంలో వర్షం పడితే నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు

రెండు రోజులుగా వాతావరణంలో మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీలకు పడిపోయింది. పగలంతా వాతావరణం చల్లగా ఉండటంతో పలు ప్రాంతాల్లో చలి మంటలతో ఉపశమనం పొందుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ నెల 28 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అవగాహనతోనే నేరాల కట్టడి

- ఈ ఏడాది జిల్లాలో సైబర్ క్రైం పెరిగింది
- ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్: గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో సైబర్, ఆర్థిక నేరాలు పెరిగాయని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం తాండూరు మండలం గౌతాపూర్ శివారులోని రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హత్యలు, హత్యాయత్నం, అత్యాచార కేసులు తగ్గినట్లు చెప్పారు. ఆర్థిక మోసాలు, లోన్ యాప్స్, ఓటీపీ, సెక్స్ టార్చర్ లాంటి కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ మోసగాళ్ల బారిన పడి ప్రజలు రూ.4 కోట్ల 50 లక్షల నగదు పోగొట్టుకున్నారని వివరించారు. గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం పెరగడంతో సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని తెలిపారు. వాటిని నివారించాలంటే అవగాహన ఒక్కటే మార్గమన్నారు.

తాండూరు సర్కిల్ పరిధిలో..

తాండూరు సర్కిల్ పరిధిలోని కరన్‌కోట్, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లలో గత ఏడాది కంటే ఈ సారి క్రైం రేటు పెరిగినట్లు ఎస్పీ తెలిపారు. ఈ నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 795 కేసులు నమోదయ్యాయని చెప్పారు. 22 గ్రేవ్ కేసులు, మూడు హత్య కేసులు, 10 రేప్ కేసులు, 3 రోడ్డు ప్రమాదాలు, 94 ఆత్మహత్య కేసులు, 53 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. 56 ఇసుక అక్రమ రవాణా కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అతివేగంగా వెళ్లే ఇసుక ట్రాక్టర్లకు చలాన్ వేయాలని ఆదేశించారు. నాపరాతి గనుల్లో బ్లాస్టింగ్, ఓవర్‌లోడ్‌తో వెళ్లే లారీలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజ చేసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

విద్య, వైద్య రంగాలకు కృషి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్: నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గురువారం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో రూ.23 కోట్లా 45 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, భవన నిర్మాణాలకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి కలెక్టర్ భూమిపూజ చేశారు. బీసీ గురుకులంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. కొత్త మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగారు.గురుకుల పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్య మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. సమీప భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, ఏఎంసీ అధ్యక్షుడు అంబయ్యగౌడ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆప్యాయ పలకరింపే ప్రథమ చికిత్స కావాలి

- పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్
- బొంరాస్‌పేట పీహెచ్‌సీ సందర్శన



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

బొంరాస్‌పేట: వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఆప్యాయ పలకరింపే ప్రథమ చికిత్స కావాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఓపీని పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్ఓ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రతి కార్యక్రమం పట్ల అవగాహన పెంచుకొని విజయవంతం చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఇరుగు పొరుగు జిల్లాల వారితో సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. ల్యాబ్ సమూనాలు సేకరించి అవసరమైన వాటినే టీహబ్‌కు పంపాలన్నారు. పీహెచ్‌సీలో ఎన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌ను అడగ్గా ఆయన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల బాధ్యత లేకుండా ఉండరాదని, కనీస సమాచారం లేకుండా ఎలా పనిచేస్తున్నారని మండిపడ్డారు. డీఐఓ బుచ్చిబాబు, ఉప సంచాలకులు జీవరాజ్, శ్రీనివాస్, పీఓ పవిత్ర, వైద్యాధికారులు హేమంత్, అక్షయ్ ఉన్నారు.

రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు



కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన ఆటో

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వస్తున్న కారు రెండు ఆటోలను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం నుంచి గుమ్మడవెల్లికి వెళ్తున్న కారు గురునానక్ కాలేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీకొట్టింది. మొదట ఢీకొట్టిన ఆటో మాడ్గుల మండలం ఫకీర్ తండా నుంచి వస్తోంది. అందులో ప్రయాణిస్తున్న కిషన్, బుజ్జి, నిరోషాకు గాయాలయ్యాయి. మీర్‌పేట్ జిల్లెలగూడలో నివసించే ఐదుగురు కూలీలను తీసుకొని కుర్మేండ్‌లో నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా రెండో ఆటో ప్రమాదానికి గురైంది. ఆటోలోని వెంకటరతమ్మ, శ్రీనుకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను నగరంలోని ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

దుద్యాల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి
- మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



దుద్యాల్‌లో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి తదితరులు

దుద్యాల్: కొత్తగా ఏర్పాటైన దుద్యాల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్, కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండల కేంద్రంలో రూ.8.50 కోట్లతో మండల సమీకృత భవనాలకు, హకీంపేట్‌లో రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల భవన నిర్మాణానికి, రూ.64 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణం, రూ.1.65కోట్లతో హస్నాబాద్‌లో పాఠశాల భవనం నిర్మాణానికి కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి భూమిపూజ చేశారు. దుద్యాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌ను మల్టీజోన్ -2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి ప్రారంభించారు. హకీంపేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుద్యాల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రోడ్లు, పాఠశాలలు, కళాశాలలు, పీహెచ్‌సీలు మంజూరైనట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంఈవో విజయ రామారావు, వికారాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నారాయణపేట్ గ్రంథలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడు శేఖర్, కొడంగల్ అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ, డాక్టర్

కొత్తగా ప్రారంభమైన దుద్యాల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా భరత్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి ఎస్ఐని కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. హకీంపేట్ పీహెచ్‌సీ వైద్యురాలిగా డాక్టర్ వందన బాధ్యతలు చేపట్టారు. ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్ ఆమెను అభినందించారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



చేవెళ్లలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: పేదలు, కార్మికులు, కర్షకుల పక్షాన పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏర్పడిన మొట్టమొదటి రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ పరిష్కరించిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసి నిజాం దొరలను తరిమికొట్టినట్లు చెప్పారు. దున్నే వాడికే భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాలు పేదలకు పంచిందన్నారు. బ్యాంకులను జాతీయం చేయటంలో ప్రధానపాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా 100 వసంతాల కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు ఎం.ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, జె.అంజయ్య, వడ్ల మంజుల, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణగౌడ్, శివ, యాదగిరి, మీనాక్షి, లలిత, వెంకటమ్మ, రమాదేవి, శ్రీకాంత్, పెంటయ్య, కృష్ణచారి, పోచయ్య ఉన్నారు.

మొయినాబాద్: సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మొయినాబాద్‌లో ఎర్రజెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు జంగయ్య, జహంగీర్, జలీల్ పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: మండల కేంద్రంలో గురువారం సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య గురువారం బస్టాండ్ ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 100 ఏళ్లుగా పేదల పక్షాన పోరాటం చేస్తూ, పేద, బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పార్టీ సీపీఐ అన్నారు.



టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పాడిరైతులు

పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

- టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

కద్తాల్: పాడి పరిశ్రామిభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రాన్ని గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పాల సేకరణ వివరాలను మేనేజర్ రాధికను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా సమాఖ్య పనిచేస్తుందని పేర్కొన్నారు. స్థానిక విజయ డెయిరీ పరిధిలో పాడి రైతులకు సకాలంలో పాలబిల్లులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, పాడి రైతు సంఘం నాయకుడు కడారి రామకృష్ణ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కద్తాల్ విజయ సొసైటీ అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ముద్దాయిపేట ఎల్లమ్మ జాతర



జాతర ఆవరణలో ఏర్పాటైన రంగుల రాట్నం

యాలాల: మండలంలోని ముద్దాయిపేట ఎల్లమ్మ జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన సిడే ఊరేగింపును ఘనంగా నిర్వహిస్తుంటారు. శనివారం చుక్కబోనాలు, ఆదివారం రథోత్సవంతో జాతర ముగుస్తాయి. ఈ ఏడాది సోమవారం రోజు డాన్స్ పోటీలను జాతర నిర్వహణ కమిటీ నిర్వహిస్తుంది. డాన్స్ పోటీలతో పాటు శనివారం రోజు పోతురాజు, కాళీమాత, కాంతార వేషధారణలో కార్యక్రమాలను వైవిధ్యంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసింది. జాతరలో భాగంగా ఇప్పటికే ఆలయ ఆవరణలో భారీ సంఖ్యలో ఆట వస్తువులు, దుకాణ సముదాయాలు వెలిశాయి.

రిటైరైన కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి



లేబర్ కమిషనర్‌ను కలిసి బయటకు వస్తున్న సీసీఐ కాంట్రాక్టు కార్మికులు

తాండూరు రూరల్: కరన్‌కోట్ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీలో పనిచేసి, రిటైరైన కాంట్రాక్టు కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలని సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాఘవేందర్ గురువారం కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం శరణప్ప మాట్లాడుతూ.. గ్రాట్యుటీ చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఏల్పటి అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మనాయక్‌తండాకు చెందిన రేణుక అనారోగ్యంతో బాధపడడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి కింద రూ.19 వేల చెక్కును మంజూరు చేయించి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, మాజీ ఎంపీటీసీ సంగీత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యాచారం: రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలైన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన గుంపెన యాదగిరి(25) ఈ నెల 24న సాయంత్రం తన స్వగ్రామం నుంచి బైక్‌పై కటికపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో సార్లరావులపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ఓ బైకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో యాదగిరికి తీవ్ర గాయాలై నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణంరాజు తెలిపారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కరువు
- మృత్యువాత పడుతున్న రైతులు, మూగజీవాలు
- నిర్లక్ష్య నీడలో అధికార యంత్రాంగం

- మండల పరిధిలోని బార్లపల్లి గ్రామానికి చెందిన పామెన రామకృష్ణారెడ్డి(58), కొంగి నర్సింలు ట్రాక్టర్‌పై అదే గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి కంది పంటలో మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు రామకృష్ణారెడ్డి తలకు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. మిగతా వారు గాయాలతో బయటపడ్డారు.
- మన్నెగూడకు చెందిన గంగెద్ల వెంకటేశ్‌కు చెందిన ఆవు గత నెలలో మార్కెట్‌లో మేత మేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



మన్నెగూడలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు (ఫైల్)

పూడూరు: ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ పొలాల్లో స్తంభాల వద్ద విద్యుదాఘాతంతో రైతులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అయినా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వర్షాకాలం వస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఉన్న అర్తింగ్ సమస్య తీవ్రమై రైతులతో పాటు నోరులేని మూగజీవాల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మరమ్మతులు చేసేందుకు వెళ్లిన వారు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. రూ.లక్షలు పెట్టి సాకుతున్న పశువులు, జీవాలు విద్యుత్ ప్రమాదాల బారిన పడి చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రక్షిత కంచెలను ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

పరిహారం అందించాలి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. పంట పొలాల్లో తరచూ విద్యుత్ షాక్‌కు గురై మూగజీవాలు చనిపోతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆన్ ఆఫ్ సిస్టంను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి. బాధిత రైతులకు నష్ట పరిహారం అందించాలి.

– రవీందర్, కంకల్

చర్యలు తీసుకుంటున్నాం

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూలిపోయే స్థితిలో ఉన్న దిమ్మెలను సరి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. లూప్ లైన్ సరిచేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పెన్సింగ్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారిస్తాం. నష్ట పరిహారం కోసం వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించాం. సమస్యలు ఉంటే 94408 13089 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

– రాజునాయక్, విద్యుత్ ఏఈ, మన్నెగూడ

బైక్ అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొని

ఒకరి దుర్మరణం



అనంతయ్య (ఫైల్)

చేవెళ్ల: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి త్రీవంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీకి సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన డప్పు అనంతయ్య(50) బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం బుధవారం చేవెళ్ల వైపు వచ్చి రాత్రి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీకి సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన ఎగిరి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యే చంపేసింది..

- గుర్తు తెలియని మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- వేధింపులు తాళలేక..
- సోదరితో కలిసి మృతుడి భార్య ఘాతుకం



ముంతాజ్ ఆలం (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో మిస్టరీ వీడింది. తన సోదరితో కలిసి మృతుడి భార్య ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. గురువారం నిందితులను అరెస్ట్ చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే దారిలో హ్యాపీ వైన్స్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా వెళ్లిన పోలీసులు సంచిలో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితమే ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి పారవేసినట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఈ నెల 21న తెల్లవారుజామున ఇద్దరు మహిళలు మృతదేహంతో ఉన్న సంచిని తీసుకువచ్చి డ్రైనేజీలో పారవేసినట్లు వెల్లడైంది. దీని ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.

వేధింపులు తాళలేక..

బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ముంతాజ్ ఆలం(40), రౌషన్ ఖాతున్ దంపతులు నగరానికి వలస వచ్చి ఉడ్డెంగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ముంతాజ్ ఆలం అదే ప్రాంతంలోని చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్యతో గొడవపడటమేగాక ఆమెను కొట్టేవాడు. ఈ విషయాన్ని ఆమె తన సోదరి అక్క రవీనా బీబీకి చెప్పింది. ఈ నెల 20న మద్యం తాగి ఇంటికి వచ్చిన ముంతాజ్ ఆలం నిద్ర పోతుండగా రౌషన్ ఖాతున్, రవినా బీబీ నవారు తాడుతో అతని గొంతుకు ఉరి బిగించి హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా నవారు తాడుతో కాళ్లు, చేతులు కట్టి సంచిలో కుక్కి 21న తెల్లవారుజామున లక్ష్మిగూడ చౌరస్తాకు చేరుకున్నారు. ప్యాసింజర్ ఆటోలో ఎక్కి దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే దారిలో దిగిన వారు డ్రైనేజీలో సంచిని పారవేసి వెళ్లిపోయారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

సీఎం సలహాదారుడిని కలిసిన ‘చిలుక’



పండ్ల బుట్టను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పండ్ల బుట్ట అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటేష్ (ఫైల్)

మాడ్గుల: పనికి వెళ్తున్నానని చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని దొడ్లపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏదుల వెంకటేష్(26) టైల్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న అతడు పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం వెంకటేష్ తండ్రి మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంట కాపలాకు వెళ్తుండగా..

బైక్ ఢీకొని రైతు దుర్మరణం



లోక్యానాయక్ (ఫైల్)

బొంరాస్‌పేట: వేరుశనగ పంట కాపలా కోసం వెళ్తున్న ఓ గిరిజన దంపతులను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని బుర్రితండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎండీ రవూఫ్ వివరాల మేరకు.. బుర్రితండాకు చెందిన దంపతులు కేతావత్ బుజ్జిబాయి, లోక్యానాయక్(44) బుధవారం రాత్రి ఇంటి నుంచి పంట కాపలా కోసం నడుచుకుంటూ పొలానికి వెళ్తున్నారు. సమీపంలోని బుర్రితండా గేటు చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా పరిగినుంచి కొడంగల్‌కు వైపు వెళ్తున్న బైక్ వీరిని ఢీకొట్టింది. తీవ్రగాయాలైన మల్లేశ్‌ను పరిగి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బైక్‌పై వెళ్తున్న నారాయణపేట జిల్లా ఊట్కూరుకు చెందిన మల్లేశ్ సైతం తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతుళ్లున్నారు.

కారును ఢీకొన్న లారీ

ఆరుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

తాండూరు టౌన్: అతి వేగంగా వెళ్తున్న లారీ ఓ కారును ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ నర్సింలు గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు పట్టణంలోని సీతారాంపేట్‌కు చెందిన చాకలి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి జహీరాబాద్‌లో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లి కారులో తిరిగి వస్తున్నాడు. తాండూరు మండలం అంతారం గ్రామ సమీపంలో అతి వేగంగా ఎదురుగా వచ్చిన ఓ లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న శ్రీనివాస్, అశ్విని, అనిత, బాలమణి, సమీక్ష, షణ్ముకప్రియకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అశ్విని కుడి కాలు, బాలమణి ఎడమ చేయి విరిగింది. కాగా అనిత పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బస్సును ఢీకొట్టి

బిహార్ కార్మికుడి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో పడి ఉన్న శోభాదాస్ మృతదేహం

నందిగామ: ద్విచక్రవాహనంపై రాంగ్ రూట్‌లో వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని పాత జాతీయ రహదారిపై రాయలసీమ పరిశ్రమ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన శోభాదాస్(35), శంబుదాస్‌లు స్నేహితులు. వీరు కొత్తూరులో నివాసం ఉంటున్నారు. శోభాదాస్ వీర్లపల్లి శివారులోని మహవీర్ పరిశ్రమలో, శంబుదాస్ కొత్తూరు సమీపంలోని వినాయక స్టీల్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం పని నిమిత్తం అయ్యప్ప స్వామి టెంపుల్ వైపు నుంచి నందిగామ వైపునకు ఇద్దరు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక రాయలసీమ ఐరన్ పరిశ్రమ సమీపంలో షాద్‌నగర్ నుంచి కొత్తూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శోభాదాస్(35) అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. శంబుదాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

కీసర: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి –చర్లపల్లి రహదారిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంపల్లికి చెందిన అంకర్ల శివకుమార్ ముదిరాజ్(29) చర్లపల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి డ్యూటీ నుంచి బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతుండగా మార్గ మధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం రాంపల్లి యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. రాంపల్లి –చర్లపల్లి రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సదరు కాంట్రాక్టర్ మృతుడి కుటుంబానికి రూ 6 లక్షలు పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు సమాచారం.

కేంద్ర మంత్రికి సత్కారం

రాజేంద్రనగర్: నగరంలో జరిగిన సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాగాల్‌ను గురువారం ఉదయం రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, నేతలు కొమురయ్య పాల్గొన్నారు.

ఉదాసీనంగా ఉంటే ఊరుకోరు!

- రెసిడెన్షియల్ స్పేస్ కమర్షియల్‌కు వినియోగం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని కొందరు అధికారులు
- ప్రత్యేకంగా దృష్టి పెట్టిన హైడ్రా బృందాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు నరకం చూపిస్తున్నాయి. గణనీయంగా పెరిగిపోతున్న వాహనాలతో పాటు వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్‌కు సరైన పార్కింగ్ వసతి లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం. దీనిపై దృష్టి పెట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఫిర్యాదుల ఆధారంగా కూల్చివేతలు ప్రారంభించింది. దీంతో పాటు ఆ సమస్యకు మూలమైన, ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల అంశాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత విభాగాలు, ప్రభుత్వంతో పాటు అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) సిఫార్సు చేయాలని నిర్ణయించింది. జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా నగరంలోని ట్రాఫిక్ స్థితిగతుల పైనా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు డీఆర్‌ఎఫ్ సిబ్బంది ట్రాఫిక్ వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న అంశాలను హైడ్రా పరిగణలోకి తీసుకుంటోంది. నగరంలోని అనేక వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్ స్థితిగతుల్ని పరిశీలిస్తే... వాటిని లభించిన అనుమతులు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాల మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉంటున్నాయి. ఆయా భవనాల నిర్మాణాలు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ), ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చే వరకు సవ్యంగానే ఉంటున్నాయి. ఈ సర్టిఫికెట్లు వచ్చిన తర్వాత మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. సామూహిక, గృహ అవసరాలకు, పార్కింగ్ తదితర సౌకర్యాలకు కేటాయించిన స్థలం కమర్షియల్ స్పేస్‌గా మారిపోతోంది. అక్కడ చిన్న చిన్న.. ఒక్కోసారి బ్యాంకులు వంటి పెద్ద పెద్ద వాణిజ్య, వ్యాపార సంస్థలకు పుట్టుకువస్తున్నాయి. దీనిపై కన్నేసి ఉంచాల్సిన ప్రభుత్వ విభాగాలు మిన్నకుండిపోతున్నాయి. అసోసియేషన్లు, ప్లాట్లు, ఫ్లాట్ల యజమానులు ఫిర్యాదు చేసినా కొందరు అధికారులు పట్టించుకోవట్లేదు. దీనికి ప్రలోభాలు సహా అనేక కారణాలు ఉంటున్నాయి. ఇలా రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌కు రూపుమారిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టి పెట్టింది. వీటికి సంబంధించిన ఫిర్యాదులను ఈ విభాగం స్వీకరిస్తోంది. ఇలాంటి ఫిర్యాదుల వెనుక వ్యక్తిగత కారణాలు, కక్షలు, బెదిరింపు ధోరణులు వంటివి నిగూఢంగా ఉండే ఆస్కారం ఉందని హైడ్రా అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. నేరుగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో పని చేసే ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు రికార్డులను పరిశీలించడం ద్వారా అసలు విషయం తేలుస్తాయి. ఆపై హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ నేతృత్వంలో జరిగే సమావేశంలో ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సైతం పాల్గొంటారు. దీని తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుని స్థానిక అధికారుల ద్వారా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఇలాంటి ‘మార్పిడులు’ కొనసాగకుండా, పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారుల పైనా చర్యలు అనివార్యమని హైడ్రా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారాలు చోటు చేసుకోవడానికి బాధ్యతులుగా తేలే అధికారుల పైనా చర్యలకు సిఫార్సు చేయాలని హైడ్రా అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

‘సర్కిల్’లో పర్యవేక్షణ కరువు!

- ఈ నెల 11 నుంచి ఖాళీగా ఇబ్రహీంపట్నం సీఐ కుర్చీ
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం ఠాణాలో స్టేషన్‌హౌస్ అధికారి లేక ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసుల పురోగతిని పర్యవేక్షించడం కరువైంది. దీని ప్రభావం నేరాల నియంత్రణపై పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఇటీవల కానిస్టేబుల్ నాగమణి మర్డర్ కేసును ఛేదించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఈ నెల 11న రాచకొండ కమిషనర్ ఇక్కడ పనిచేసే సీఐ సత్యనారాయణను కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. అప్పటి నుంచి ఇబ్రహీంపట్నం సీఐ కుర్చీ ఖాళీగానే దర్శనమిస్తోంది. నిత్యం నిర్వహించాల్సిన పోలీసు కార్యచరణ భారమంతా అడ్మిన్ ఎస్‌ఐ మీదే పడుతుంది.

జవాబుదారీ కరువు

క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సీఐ సత్యనారాయణ వెళ్లి పోయి 15 రోజులు గడుస్తుంది. కానీ నేటికీ ఇక్కడికి పోస్టింగ్ ఇవ్వకపోవడంపై ఆసక్తి నెలకొంది. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మండలంలోని 14 గ్రామాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 వార్డులు, ఆదిబట్ల మున్సిపాలిటీలోని 3 వార్డులు వస్తాయి. సుమారు 60 వేలకు పైగా జనాభా ఉంటుంది. నిరంతరం నాగార్జున సాగర్ జాతీయ రహదారి వెంట ఏదో ఓ చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. గంజాయి, పేకాట, చోరీలు, హత్యలు, మోసాల తదితర కేసులు సైతం ఇటీవల ఎక్కువగానే నమోదవుతున్నాయి. గత 15 రోజుల్లోనే 30కి పైగానే వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన కేసు సంచలనంగా మారింది. స్టేషన్ హౌజ్ అధికారి ఉంటే దర్యాప్తు సమయంలో జవాబుదారీగా ఉండేది.

మంచాల సీఐకి అదనపు బాధ్యతలు

మంచాల సీఐ మధుకు ఇబ్రహీంపట్నం అదనపు బాధ్యతలు అప్పగించారు. మంచాలలో కూడా అనేక కేసులు, నిత్యం ఏదో ఒక పంచాయతీలతో పోలీస్‌స్టేషన్ బిజీగా ఉంటుంది. అక్కడ ఇక్కడ పని చేయడం తలకు మించిన భారంగా మారుతుంది. విధి నిర్వహణలో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు వస్తే రాత్రి పది గంటలకు ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రెండు రోజులుగా మంచాల సీఐ సెలవులపై వెళ్లడంతో యాచారం సీఐకి ఇబ్రహీంపట్నం బాధ్యతలు అప్పగించారు. ఇలా ఒకరికి కాకపోతే మరొకరికి అదనపు బాధ్యతలతో సరి పెడుతున్నారు. ఇబ్రహీంపట్నానికి శాశ్వత సీఐని కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జోరుగా పైరవీలు

ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ నగరానికి కూతవేటు దూరంలో ఉంటుంది. దీంతో సిటీలో ఉండే అధికారులు త్వరగా వచ్చి వెళ్లి పోవచ్చనే ఉద్దేశంతో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. కొంత మంది స్థానిక ఎమ్మెల్యే లెటర్ కోసం తిరుగుతున్నట్లు తెలిసింది. అలాగే మంత్రులు, డీజీ, ఐజీ స్థాయి అధికారుల చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే స్థానికంగా లేకపోవడంతో సీఐ నియామకం ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సీపీ నిర్ణయం తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం సీఐని అటాచ్ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో కొత్త వారు రావాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం, రాచకొండ పోలీస్ కమిషనర్ నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఠాణా సక్రమంగా నడుస్తోంది. నిత్యం పర్యవేక్షిస్తున్నాను. కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడగానే కొత్త సీఐ వస్తారు.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం